క్లుప్తంగా

శ్రీపాద శ్రీవల్లభస్వామికి సహస్ర చామంతి పూజ



విశేష అలంకరణలో శ్రీపాద శ్రీవల్లభ స్వామివారు

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలమైన పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం స్వామివారికి సహస్ర చామంతి పూజ నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. వేలాది మంది భక్తులు తిలకించి తరించారు.

విద్యుత్ సరఫరాకు మూడు రోజుల పాటు ఆటంకం

పిఠాపురం: విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా ఈ నెల 11, 12, 13 తేదీల్లో పిఠాపురం, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో పెద్దాపురం ఈఈ ప్రభాకర్ మంగళవారం తెలిపారు. పిఠాపురం, ఎల్ఎన్‌పురం, విరవాడ, గోవిందరాజు పాలెం, జల్లూరు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం వచ్చే అవకాశం ఉందన్నారు. వినియోగ దారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రైతులు నాణ్యమైన విత్తనాలనే తీసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

పిఠాపురం: రైతులు నాణ్యమైన విత్తనాలనే తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారులు ఎ. రామకృష్ణ, రాజేష్ సూచించారు. పిఠాపురంలో మంగళవారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాళ్వాలో వరి సాగుకు నాణ్యమైన విత్తనాలను తీసుకోవాలన్నారు. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. వరి పంటకు ఎకరానికి రూ.630 చొప్పున ఇన్సూరెన్స్ కట్టుకోవాలని రైతులకు సూచించారు. ఈ ఇన్సూరెన్స్ చెల్లించడానికి డిసెంబర్ 31 వరకూ గడువు ఉందన్నారు. ఈ నెలాఖరులోగా రబీ వరి నాట్లు వేసుకోవాలని, నాట్లు ఆలస్యమైతే వేదజల్లు పద్ధతిలో వేసుకోవాలని సూచించారు. అపరాల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

పద్మజకు ఉత్తమ సేవా పురస్కారం



కాకినాడలో జిల్లా జడ్జి వసంత కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పద్మజ

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ బాలురు పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న యాళ్ల పద్మజకు హ్యూమన్ రైట్స్ సేవా పురస్కారం లభించింది. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కాకినాడ డి కన్వెన్షన్ హాలులో మంగళవారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. జిల్లా జడ్జి వసంత కుమార్ చేతుల మీదగా ప్రద్మజ అవార్డును అందుకున్నారు. ఈ వేదికపై తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి, ఒడిశా రాష్ట్రాలకు చెందిన పలువురు సంఘ సేవలను సత్కరించారు. అవార్డు అందుకున్న పద్మజను పలువురు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

సినిమాలు



పెద్దాపురం	
లలితా–1:	పుష్ప–2
లలితా–2:	పుష్ప–2
వీరభద్ర:	సీ202
శోభా:	పుష్ప–2
సామర్లకోట	
జయలక్ష్మి–1:	పుష్ప–2
జయలక్ష్మి–2:	పుష్ప–2
విఘ్నేశ్వరా:	పుష్ప–2
ఉప్పాడలో	
శ్రీనివాస థియేటర్	పుష్ప–2

దశాబ్దాల కల సాకారం

- పిఠాపురంలో అందుబాటులోకి వచ్చిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- నేటి నుంచి పూర్తిస్థాయిలో క్లాసులు ప్రారంభం
- 15 ఏళ్ల తరువాత నెలవేరిన కల
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



డిగ్రీ కళాశాలకు సామగ్రి బహూకరిస్తున్న దాతలు



పిఠాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం

పిఠాపురం: నియోజకవర్గంలోని విద్యార్థుల దశాబ్దాల కల సాకారమైంది. ఇక్కడ డిగ్రీ కాలేజీ నిర్మాణం కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. 15 ఏళ్ల తరువాత ఆ కల నెరవేరడంతో విద్యార్థుల ఆనందానికి అవధుల్లేవు. ఎన్నోఏళ్లుగా పిఠాపురంలో డిగ్రీ కాలేజీ లేకపోవడంతో స్థానిక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. 2008లో పిఠాపురానికి డిగ్రీ కాలేజీ మంజూరైంది. కానీ దాని నిర్మాణం మాత్రం ముందుకు సాగలేదు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఓఎన్‌జీసీ సహకారంతో కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.5 కోట్లు కేటాయించింది. దీంతో 2021 అక్టోబర్ 5న కళాశాల నిర్మాణానికి అప్పటి మంత్రులు, వైఎస్సార్ సీపీ నేతలు శంకుస్థాపన చేశారు. చివరకు నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులు అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకూ హాఫ్ డే

పిఠాపురంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇప్పటివరకూ స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జూనియర్ కళాశాలలో ఒక పూట జూనియర్ కళాశాల, మరో పూట డిగ్రీ కళాశాల నిర్వహించేవారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. సమయాభావం వల్ల క్లాసులు సక్రమంగా జరిగేవి కాదు.

ఈ కళాశాలలో బీఏ హానర్స్ ఎకనామిక్స్, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ హానర్స్ కెమిస్ట్రీ, బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ హానర్స్ జూవాలజీ గ్రూపులు మాత్రమే నిర్వహిస్తున్నారు. సుమారు 300 మంది విద్యార్థులు, 20 మంది అధ్యాపకులు గత 15 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందుల నడుమ క్లాసులు నిర్వహించారు. చదువుకోడానికి తగిన స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడిన విద్యార్థులు ఇప్పుడు అహ్లాదకర వాతావరణం, తగినన్ని తరగతి గదులు, ఆట స్థలాలతో డిగ్రీ చదువు పూర్తి చేయనున్నారు. ఇకపై పిఠాపురం నియోజకవర్గంలో విద్యార్థులతో పాటు ఇతర ప్రాంతాల విద్యార్థులకు ఈ కళాశాల విద్యాకుసుమాలు విరజిల్లనుంది.

ఆనందంగా ఉంది



ఇప్పటి వరకూ ఒక పూటే క్లాసులు నిర్వహించడం వల్ల ఉదయాన్నే ఉరుకులు, పరుగులుగా కళాశాలకు రావాల్సి వచ్చేది. క్లాసులు అంతంతమాత్రంగానే ఉండేవి. సౌకర్యాలు లేక చాలా ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం కళాశాల నూతన భవనం ప్రారంభం కావడం, కొత్త తరగతి గదులు అందుబాటులోకి రావడంతో చాలా ఆనందంగా ఉంది. ఇక మా ఇబ్బందులు తొలగిపోయినట్లే.

వి సత్య, విద్యార్థిని, బీకాం కంప్యూటర్స్, డిగ్రీ కాలేజ్, పిఠాపురం

మా సమస్యలు తీరినట్లే..



డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో ఇప్పటి వరకు తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నాం. ఇప్పుడు మా సమస్యలు తీరినట్లే. నూతన భవనం ప్రారంభం కావడం మాకు చాలా ఆనందంగా ఉంది. సౌకర్యాలు మెరుగు పడడంతో బాగా చదువుకోడానికి వీలు కలుగుతుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లిన విద్యార్థులు సైతం ఇక్కడకు వచ్చేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. కోర్సులు కూడా పెరిగే అవకాశం ఉండడంతో మాకు చాలా ఆనందంగా ఉంది.

కె.శ్రీరామ్, విద్యార్థి, బీఎస్సీ కెమిస్ట్రీ, డిగ్రీ కాలేజ్, పిఠాపురం

మరిన్ని సౌకర్యాల కల్పనకు చర్యలు



నూతన కళాశాల భవనం అందుబాటులోకి వచ్చింది. బుధవారం నుంచి పూర్తి స్థాయిలో క్లాసులు ప్రారంభిస్తున్నాం. కళాశాలకు కాంపౌండ్ వాల్, ఇతర సౌకర్యాల ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చారు. త్వరలోనే వాటిని ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే పలువురు దాతలు కళాశాలకు సామగ్రి బహూకరించారు. భవిష్యత్‌లో మరిన్ని సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక భవనం అందుబాటులోకి రావడంతో విద్యాప్రమాణాలు పెరుగుతాయి. నూతన భవనం అందుబాటులోకి రావడంతో గత 15 ఏళ్లుగా విద్యార్థులు పడిన కష్టాలు తీరాయి.

డాక్టర్ పి.సుభాషిణి, ప్రిన్సిపల్, ప్రభుత్వం డిగ్రీ కళాశాల, పిఠాపురం

13న హనుమద్వ్రతం



సామర్లకోటలో 65 అడుగుల ఎత్తైన ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం

సామర్లకోట: స్థానిక మారుతినగర్‌లోని 65 అడుగుల ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 13 నుంచి హనుమద్వ్రతం నిర్వహించనున్నారు. హనుమజ్జయంతి సందర్భంగా ఆలయ ధర్మకర్త చంద్రాభట్ల పతంజలిశాస్త్రి ఆధ్వర్యంలో ఈ వ్రతాలు ప్రారంభిస్తారు. ఆ రోజు ఉదయం దంపతులచే సామూహిక వ్రతాలు నిర్వహిస్తారు. సాయంత్రం స్వామివారికి లక్ష నాగవల్లీ పత్రి పూజ, ఆంజనేయ హోమం, నీరాజన మంత్ర పుష్పాలు, దర్బారు సేవ నిర్వహించనున్నారు. రాత్రికి పెద్ద ఆంజనేయస్వామి వారికి వివిధ రకాల పుష్పాలు, తమలపాకుల తో అభిషేకం జరుగుతుంది. 14న ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, సుందర కాండ పారాయణ, సాయంత్రం గణపతి హోమం, నవగ్రహ హోమం, శత రుద్రీయ హోమం, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహిస్తారు. 15న దత్తజయంతి సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఉన్న దత్తాత్రేయునికి ఏకాదశ రుద్రాభిషేకం, హోమం, పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. అలాగే పలు దేవాలయాల్లో సైతం హనుమద్వ్రతం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్ సీపీ నేత బొత్సకు ఘన స్వాగతం



పిఠాపురంలో బొత్స సత్యనారాయణకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



పిఠాపురం నుంచి కాకినాడ సభకు తరలివెళుతున్న నాయకులు

కాకినాడ సభకు భారీగా తరలివెళ్లిన నేతలు

పిఠాపురం: కాకినాడలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల సమావేశానికి వచ్చిన మాజీ మంత్రి, ఆ పార్టీ రిజినల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణకు పిఠాపురంలో నేతలు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కాకినాడ సభకు పిఠాపురం నేతలు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, వివిధ పదవుల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు కాకినాడ సభకు వెళ్లారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంతో పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

దివ్యాంగులపై శ్రద్ధ చూపాలి



విద్యార్థులకు పండ్లు, స్వీట్లు, రొట్టెలు పంపిణీ చేసిన కమిషనర్ శ్రీవిద్య తదితరులు

సామర్లకోట: దివ్యాంగుల విషయంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కేక్ కట్ చేయించి పండ్లు, రొట్టెలు, స్వీట్లు పంపిణీ చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించినన మానవహక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పల కొండ, ఎంఈఓ–2 పి.పుల్లయ్య మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు ఉండే పాఠశాలలో తరచూ మంచి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మానవహక్కుల సంఘ నాయకులు ఎస్.రెహమాన్, కుంచే నానిబాబు, జుత్తుక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తెలికుల పుంత డ్రైనులో పూడికతీత

సామర్లకోట: స్థానిక 13వ వార్డు తెలికుల పుంత ప్రధాన డ్రైనులో మంగళవారం పూడక తీత ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఈ పనులను పరిశీలించారు. నువ్వులు కడిగిన పొట్టు, నీటితో డ్రైను పూర్తిగా నిండి పోవడంతో ఇటీవల మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న జగదీశ్వరస్వామి ఆలయం ప్రధాన ద్వారం వద్దకు డ్రైనులో నీరు చేరిన విషయం తెలిసిందే. దాంతో అప్పట్లో తాత్కలికంగా డ్రైను తీసి వదిలేశారు. దీంతో స్పెషల్ డ్రైవ్‌లో పూడికతీత పనులు చేయిస్తున్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

సామర్లకోట: పట్టణంలో ఇటీవల దోమలు పెరిగి పోవడంతో మంగళవారం ఫాగింగ్ చేపట్టారు. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ పితాని కృష్ణ లేవనెత్తిన అంశం మేరకు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ఆదేశాలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఫాగింగ్ ప్రారంభించారు. రాజశేఖర్ విలేకర్లతో మాట్లాడుతూ దోమల నివారణకు ప్రధాన రహదారుల వెంబడి ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ సదస్సుకు 90 దరఖాస్తులు



అమీనాబాద్ సదస్సులో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి సత్యనారాయణ

కొత్తపల్లి: గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు పిఠాపురం నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అమీనాబాద్‌లో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు 90 దరఖాస్తులు అందినట్లు తసిల్దార్ చిన్నారావు తెలిపారు. ఆయా అర్జీలను విచారించి పరిష్కరిస్తామని చెప్పారు. కాగా బుధవారం మండలంలోని గొర్సలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి

- రికవరీలు పెంచాలి
- డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి

సామర్లకోట: మహిళా సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి అన్నారు. జిల్లా 3వ మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం సందర్భంగా స్థానిక టీటీడీసీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. జిల్లాలో 39,600 గ్రామ సంఘాలు ఉండగా, వాటిలో కనీసం 80 శాతం గ్రేడ్–ఎగా తయారు చేయాలన్నారు. జిల్లాలోని 24 మండల సమాఖ్యల్లో 20 శాతం మాత్రమే గ్రేడ్–ఎలో ఉన్నాయని, 75 శాతం గ్రేడ్–ఎలోకి వచ్చేలా జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు, డీఆర్‌డీఏ సిబ్బంది, డీపీఎంలు, ఏపీఎంలు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో 26,968 మహిళా సంఘాలకు రూ.1,730 కోట్ల బ్యాంకు లింకేజ్ లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటి వరకూ 11,558 సంఘాలకు రూ.759 కోట్ల మేర బ్యాంకు లింకేజ్ అయిందన్నారు. మిగిలిన సంఘాలకు జనవరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. రికవరీ శాతం పెంచాలన్నారు. ప్రతి గ్రామ, మండల సమాఖ్యలు ఆడిట్ చేయించాలన్నారు. ప్రతి నెలా గ్రామ, మండల సమాఖ్యలు సమావేశాలు నిర్వహించి, ఆయా సంఘాల ఆర్థిక పురోగతిని వివరించాలని సూచించారు. తదుపరి నెలలో చేపట్టే కార్యక్రమాలను సభ్యులకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకో యాప్‌లో ప్రతి సభ్యురాలిని నమోదు చేయడం వలన ఒక ఐపీ నంబరు ద్వారా వారికి భద్రత ఏర్పడుతుందని చెప్పారు. బాలికల సంరక్షణలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని పీడీ సూచించారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఐ.కాంచన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి కె.సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలు జి.కాంతం, సహాయ కార్యదర్శి వి.నూకరత్నం, కోశాధికారి డి.నిర్మల, ఐబీ ఏపీడీ జిలానీ, డీపీఎంలు, జీవనోపాధుల డీపీఎం ఎ.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షురాలిగా ధనలక్ష్మి

జిల్లా మహిళా సమాఖ్య రెండేళ్ల పదవీ కాలం పూర్తి కావడంతో మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జె.ధనలక్ష్మి (తాళ్లరేవు), ఉపాధ్యక్షులుగా బి.చంటమ్మ (తొండంగి), కార్యదర్శిగా వై.నాంచారమ్మ (సామర్లకోట), కోశాధికారిగా కె.రత్నం (గండేపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో డీపీఎం (ఫైనాన్స్) బాబూరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

వస్త్ర కమిటీ అధ్యక్షురాలిగా భవాని

జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యాన స్థానిక టీటీడీసీలో తయారవుతున్న దుస్తుల తయారీ కమిటీకి నూతన అధ్యక్షురాలిగా డి.భవాని (కరప), ఉపాధ్యక్షురాలిగా అంబటి లక్ష్మి (రౌతులపూడి), కార్యదర్శిగా పి.ఎస్తేరు రాణి (కిర్లంపూడి), సహాయ కార్యదర్శిగా పి.లోవ (తుని), కోశాధికారిగా పి.దుర్గావేణి (కాజులూరు) ఎన్నికయ్యారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమ మహేశ్వరి

సామర్లకోట: బాల్య వివాహాల నిరోధంపై ప్రజలల్లో అవగాహన పెంచాలని ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. బాల్య వివాహాల నిరోధంపై మండల స్థాయిలో అధికారులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బాలికలకు చిన్న వయసులోనే వివాహం చేయడం వలన అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం బాలికలకు 18, బాలురకు 21 ఏళ్లు వచ్చే వరకు వివాహాలు చేయకుండా అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వీఆర్వోలపై ఉన్నదన్నారు. తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. ఈ మేరకు గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు మహిళల్లో అవగాహన పెంచాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలు బాల్య వివాహాలను గుర్తించి అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉష, ఎంఈఓలు వై.శివ రామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఈఓపీఆర్డీ భైరవమూర్తి, చైల్డ్ లైన్ అధికారులు శ్రీనివాసరావు, స్వర్ణలత, విజయ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులు పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి దైవకృప

పెద్దాపురం: మానవ హక్కుల పరిరరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి దైవ కృప అన్నారు. మానవ హక్కుల దినోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక మహారాణి కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సేవా కార్యక్రమం ద్వారా మంచి నడవడి సాధ్యపడుతుందన్నారు. మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్ఐ మౌనిక మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణ అవసరమన్నారు. ర్యాగింగ్ జోలికి పోకుండా విద్యాబుద్ధులు నేర్చుకోవాలన్నారు. మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ మీడియా విస్తృతిలో భాగంగా అందరిలో నేర ప్రవృత్తి కూడా పెరుగుతోందన్నారు. న్యాయవాదులు అత్తిలి ప్రభూజీ, మడికి రాంబాబు మాట్లాడుతూ చట్టాల్లోని వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, ఎంవీ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొత్తపల్లి: గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ప్రవీణ సూచించారు. మండలంలోని మూలపేట సెక్టార్ కోల్లవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రలో మంగళవారం పోషణ వాటిక కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద పండించిన ఆకుకూరలు, పౌష్టికాహారాన్ని గర్భిణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీపీఓ దుర్గాదేవి, సెక్టార్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన పాస్టర్స్ ఐక్య క్రిస్మస్



క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న విశ్వాసులు

పెద్దాపురం: స్థానిక లూథరన్ హైస్కూల్ క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించే మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఐక్య క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా ముగిశాయి. అసోసియేషన్ అధ్యక్షుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ సభలో ప్రముఖ వర్తమానికులు ఏఆర్ పాల్సన్ మాట్లాడుతూ సర్వమానవాళికి మార్గదర్శి క్రీస్తు ఏసు ప్రభువేనన్నారు. ఈ సందర్భంగా ఆలపించిన క్రైస్తవ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో అసోషియేషన్ కార్యదర్శి జీవీ రత్నం, ట్రజరర్ ఐ.ప్రేమరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల సమ్మె

పెద్దాపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రెండో రోజూ మంగళవారం కార్మికుల సమ్మె చేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర నాగేశ్వరరావు, కేవీ రమణ మాట్లాడుతూ టెక్నికల్ కార్మికులు 29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు 24,500 రూపాయలు వేతనం ఇవ్వాలని, 15 ఏళ్లు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు పది లక్షలు, అంగవైకల్యానికి గురైతే ఐదు లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్వామి, బాలు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.